స్ట్రాంగ్‌రూమ్ భద్రతా ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్ భద్రతా ఏర్పాట్లను స్థానిక శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎఎస్‌పి జి.ప్రేమకాజల్ గురువారం పరిశీలించారు. స్ట్రాంగ్‌రూముల వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల కేంద్ర పోలీస్ బలగాల గార్డు, జిల్లా ఆర్మ్‌డ్ పోలీస్ గార్డు, సివిల్ పోలీస్ బందోబస్తును పరిశీలించి పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్‌రూమ్‌కి నలువైపులా పటిష్ట భద్రతా ఏర్పాట్లు, నిరంతరం సిసి కెమెరాల పర్యవేక్షణపై ఆరా తీశారు. నిరంతరం సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తనిఖీ అధికారులు నిరంతరం పహారాను తనిఖీ చేయాలన్నారు.

క్రాస్ ఓటింగ్ గుబులు

- ఎవరికి ఎసరు పెడుతుందోనన్న ఆందోళన
- వైసిపి, టిడిపి అభ్యర్థులను వెంటాడుతున్న భయం
- శ్రీకాకుళం, పాతపట్నంలో వైసిపికి అనుకూలంగా క్రాస్ ఓటింగ్
- ఎంపీ స్థానంలో టిడిపి వైపు మళ్లిన ఓట్లు

నియోజకవర్గంలో తమకు వచ్చే ఓట్లపై అభ్యర్థులు, నాయకుల్లో ఇంకా ఎడతెగని చర్చ నడుస్తోంది. ఈ సందర్భంలో క్రాస్ ఓటింగ్ పైనా చర్చ నడుస్తోంది. ఇప్పుడు అదే అంశం రెండు పార్టీల అభ్యర్థుల్లోనూ గుబులు రేపుతోంది. క్రాస్ ఓటింగ్ ఎవరికి ఎసరు తెచ్చిపెడుతుందోన్న భయం అభ్యర్థులను వెంటాడుతోంది. ఎమ్మెల్యే స్థానాలకు శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల్లో క్రాస్ ఓటింగ్ సాగినట్లు తెలుస్తోంది. ఇక్కడ వైసిపికి అనుకూలంగా క్రాస్ ఓటింగ్ జరిగిందన్న చర్చ నడుస్తోంది. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళం నియోజకవర్గంలో వైసిపి అభిమానులు కొందరు ఎంపీ రామ్మోహన్ నాయుడుపై అభిమానం చూపినట్లు చర్చ నడుస్తోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఈసారి ఎన్నికల్లోనూ క్రాస్ ఓటింగ్ సంప్రదాయం కొనసాగింది. అయితే గతంతో పోలిస్తే ఈ పర్యాయం అంత పెద్దగా లేదనే చర్చ సాగుతోంది. గతానికి భిన్నంగా క్రాస్ ఓటింగ్ సాగిందని భావిస్తున్నారు. 2019 ఎన్నికల్లో కేవలం ఎంపీ అభ్యర్థి విషయంలోనే క్రాస్ ఓటింగ్ ఎక్కువగా జరిగింది. అదీ వైసిపి అభిమానులు గతంలో టిడిపి ఎంపీ అభ్యర్థికి ఓటు వేయగా, ఈసారి టిడిపి సానుభూతిపరులు ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓటేయడం కొత్త పరిణామంగా మారింది. శ్రీకాకుళం నియోజకవర్గంలో టిడిపి సానుభూతిపరులు కొందరు ఎమ్మెల్యే స్థానానికి వైసిపికి వేసి, ఎంపీ స్థానానికి టిడిపికి వేసినట్లు చర్చ నడుస్తోంది. ప్రధానంగా శ్రీకాకుళం నగరంలో దీని ప్రభావం ఎక్కువ ఉన్నట్లు తెలుస్తోంది. శ్రీకాకుళం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండ లక్ష్మీదేవికి టిక్కెట్ ఇవ్వలేదన్న కోపంతో పార్టీ అభిమానులు కొందరు ఫ్యాన్ గుర్తుకు వేసినట్లు సమాచారం. టిడిపి గెలిచే అవకాశాలున్న నియోజకవర్గంలో క్రాస్ ఓటింగ్ ప్రభావంతో ఎవరు గెలుస్తారో చెప్పలేని పరిస్థితి నెలకొంది. పాతపట్నంలోనూ అదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ టిడిపి అభిమానులు కొందరు ఎమ్మెల్యే స్థానానికి ఫ్యాన్ గుర్తుకు, ఎంపీ స్థానానికి సైకిల్‌కు వేసినట్లు చర్చ నడుస్తోంది. ఇక్కడ మాత్రం టిడిపి నుంచి వైసిపి వైపు భారీగా క్రాస్ ఓటింగ్ జరిగినట్లు తెలుస్తోంది.



ఎంపీ అభ్యర్థులకూ క్రాస్ భయం

ఎంపీ అభ్యర్థులకు వారికి కచ్చితంగా పడాల్సిన ఓట్లు పడలేదనే చర్చ సాగుతోంది. ప్రధానంగా వైసిపి ఎంపీ అభ్యర్థికి రావాల్సిన ఓటు టిడిపి అభ్యర్థికి మళ్లినట్లు తెలుస్తోంది. శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో టిడిపి ఎంపీ అభ్యర్థికి అనుకూలంగా క్రాస్ ఓటింగ్ జరిగినట్లు సమాచారం. గతంతో పోలిస్తే ఈసారి క్రాస్ ఓటింగ్ కొంత తక్కువగా ఉందనే చర్చ నడుస్తోంది. ఎమ్మెల్యే అభ్యర్థికి ఎన్ని ఓట్లు వస్తే, ఎంపీ అభ్యర్థికీ అదే సంఖ్యలో ఓట్లు పడాలని వైసిపి అధిష్టానం ఆ పార్టీ అభ్యర్థులకు గట్టిగా చెప్పింది. క్రాస్ ఓటింగ్ అంశాన్ని ఈసారి సీరియస్‌గా తీసుకోవడంతో, గతం కంటే తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోంది.

గత ఎన్నికల్లో శ్రీకాకుళం పార్లమెంట్ స్థానం పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు గానూ ఐదుచోట్ల అభ్యర్థులు ఘన విజయం సాధించినా ఎంపీ సీటును వైసిపి కోల్పోయింది. నరసన్నపేట, పలాస, పాతపట్నం స్థానాల నుంచి వైసిపి అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందారు. నరసన్నపేటలో ధర్మాన కృష్ణదాస్‌కు 19 వేల ఆధిక్యం లభించింది. పలాస నుంచి మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు 16 వేలకు పైగా ఓట్ల మెజార్టీ రాగా, పాతపట్నం నుంచి విజయం సాధించిన రెడ్డి శాంతి 15 వేల ఓట్ల ఆధిక్యం సంపాదించారు. ఎంపీ స్థానానికి వచ్చేసరికి అప్పటి ఎంపీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ కేవలం 6,653 ఓట్ల తేడాతో ఓడిపోయారు. దువ్వాడ ఓటమికి క్రాస్ ఓటింగే ప్రధాన కారణమని గుర్తించిన పార్టీ అధిష్టానం, ఈసారి ఆ తప్పు జరగనీయకుండా తీసుకున్న జాగ్రత్తలు ఫలించినట్లు తెలుస్తోంది.

మాట్లాడుతున్న తులసీదాస్

సమరశీల పోరాటాలే శ్రీరాములుకు నివాళి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సిపిఎం సీనియర్ నాయకులు బమ్మిడి శ్రీరాములు మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు చేయడమే ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. శ్రీకాకుళం నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో గురువారం బమ్మిడి శ్రీరాములు సంస్మరణ సభను నిర్వహించారు. శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్బంధాలు సైతం లెక్క చేయకుండా తన యావత్ జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన నాయకుడు అని కొనియాడారు. చిన్న వయసులోనే ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేయడం ప్రారంభించారని తెలిపారు. నగరంపల్లి కేంద్రంగా పలాస ప్రాంతంలో ప్రజాసంఘాలను ఏర్పాటు చేసి, ప్రజాతంత్ర ఉద్యమాన్ని బలోపేతం చేశారని గుర్తుచేశారు. 1968 నుంచి 1975 వరకు అజ్ఞాతంలో ఉన్నారని, పార్వతీపురం కుట్ర కేసులో 1975లో అరెస్టయి రెండేళ్ల పాటు జైల్లో నిర్బంధించబడ్డారని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా, జిల్లా కమిటీ సభ్యునిగా, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఉపాధ్యక్షునిగా సుదీర్ఘకాలం ప్రజా ఉద్యమాల్లో పనిచేశారని చెప్పారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి మాట్లాడుతూ బమ్మిడి శ్రీరాములు ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గిరిజన, రైతాంగ, కార్మిక పోరాటాలు చేశారని కొనియాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో సిపిఎం నాయకులు పి.తేజేశ్వరరావు, కె.నాగమణి, కె.శ్రీనివాసు, వి.జి.కె మూర్తి, ఎస్.ప్రసాదరావు, ఎన్.షణ్ముఖరావు ఎస్.భాస్కరరావు, ఎం.ఆదినారాయణమూర్తి, సిహెచ్.అమ్మన్నాయుడు, ఎన్.గణపతి, ఎస్.లక్ష్మీనారాయణ, బొడ్డేపల్లి మోహనరావు, కొల్లి ఎల్లయ్య, ఎ.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణే లక్ష్యం

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

డెంగీ నివారణే లక్ష్యమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి అన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఇది సాధ్యమని చెప్పారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ ర్యాలీని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో జెండా ఊపి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృథా నీటి నిర్మూలన ద్వారా దోమలను నివారించవచ్చన్నారు. డెంగీ సోకడానికి కారణాలు ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. వాటి నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన ఉండాలన్నారు. డెంగీ, మలేరియా వంటివి దోమల ద్వారా సంక్రమిస్తాయన్నారు. డెంగీ ఈడిస్ ఈజిప్టు దోమకాటు ద్వారా సంక్రమిస్తుందని తెలిపారు. ప్రతిఒక్కరూ దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలు సంతానోత్పత్తి చేసేందుకు వీల్లేకుండా కచ్చితంగా పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. నివారణ కోసం ప్రతిఒక్కరూ పూర్తి నిబద్ధతతో విధులు నిర్వహించడం జరుతుందని ప్రతిజ్ఞ చేశారు. నిల్వ ఉన్న నీటిలో మాత్రమే డెంగీ దోమలు సంతానోత్పత్తి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ ఇంట్లో, ఆరుబయట నీటి నిల్వలు లేకుండా డ్రైగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవడం వల్ల డెంగీని అరికట్టేందుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తే తక్షణమే రక్తపరీక్ష, ఎలిసా పరీక్షలు వంటివి చేయించుకుని, వ్యాధి నిర్ధారణ అయితే తక్షణమే వైద్యుని సంప్రదించాలన్నారు. ఎటువంటి ప్రాణాపాయ పరిస్థితి ఉండబోదని తెలిపారు. డెంగీపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. ఇటువంటి కార్యక్రమాలు ర్యాలీ వరకు మాత్రమే పరిమితం కాకుండా మున్సిపల్, పారిశుధ, పంచాయతీ అధికారులు, సిబ్బంది డెంగీపై ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పి.వి సత్యనారాయణ, అర్బన్ హెల్త్ సెంటర్ లింగరాజు, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్, అర్బన్ హెల్త్ సెంటర్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఎఎంఒ శ్రీనివాస్, నరసింహం, మురళి, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

నేడు శ్రీరాములు సంస్మరణ సభ

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

సిపిఎం పూర్వ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బమ్మిడి శ్రీరాములు సంస్మరణ సభను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు, సిపిఎం నాయకులు బమ్మిడి ఆనందరావు తెలిపారు. వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లిలో ఉదయం పది గంటలకు సంస్మరణ సభ ప్రారంభమవుతుందన్నారు. సిపిఎం వజ్రపుకొత్తూరు మండల కమిటీ, బమ్మిడి శ్రీరాములు కుటుంబ సభ్యులు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. సిపిఎం మండల కమిటీ కన్వీనర్ నెయ్యిల మోహనరావు అధ్యక్షతన నిర్వహించనున్న సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, ప్రముఖ వైద్యులు తెప్పల ఆనందరావు ముఖ్య వక్తలుగా పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

కౌంటింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వచ్చే నెల నాలుగో తేదీన చేపట్టనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు ముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామని చెప్పారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద సిసి టివి కెమెరాలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు.

కౌంటింగ్‌కు సంబంధించి సిబ్బంది ఎంపిక, వారికి పలు దశల్లో శిక్షణ పూర్తి చేయాల్సి ఉందన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో టేబుళ్ల ప్లాన్ పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ సూచన ప్రకారం ప్రతి టేబుల్‌లో మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ సూపర్‌వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు ఉండేలా చూడాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద సిబ్బందికి, ఏజెంట్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పించాలని చెప్పారు. శివానీ కాలేజీలోని కౌంటింగ్ కేంద్రాల వద్ద ముందస్తు ఏర్పాట్లన్నీ సిద్ధం చేసుకోవాలన్నారు. విధి నిర్వహణలో అంకితభావం, అధికారుల మధ్య పూర్తి సమన్వయం కారణంగా జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందన్నారు.

సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, రిటర్నింగ్ అధికారులు నూరుల్ కమర్, భరత్ నాయక్, సిహెచ్.రంగయ్య, లక్ష్మణమూర్తి, రామ్మోహన్, సుదర్శన్ దొర, అప్పారావు, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, సిపిఒ ప్రసన్నలక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్, జిల్లా ఆడిట్ అధికారి సుల్తానా, డిటిసి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, డిపిఒ వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, సమగ్ర శిక్ష పిఒ ఆర్.జయప్రకాష్, ఎపిఎంఐపి పీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సూర్యుని చుట్టూ...

ఇంద్రధనస్సు మెరిసే.. సూర్యచంద్రులు మురిసే..

ప్రజాశక్తి - కవిటి

ఆకాశంలో గురువారం అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. గురువారం మధ్యాహ్నం సూర్యుడు చుట్టూ అల్లుకున్న ఇంద్రధనస్సు, రాత్రి చంద్రుని చెంతకు చేరింది. సాధారణంగా సూర్యకాంతి వలన కలిగే ఇంద్రధనస్సు ఎప్పుడూ సూర్యునికి నేరుగా, ఎదురుగా ఉన్న ఆకాశంలో కనిపిస్తాయి. గురువారం మధ్యాహ్నం సూర్యుని చుట్టూ రాత్రి చంద్రుని చుట్టూ వలయంలా ఏర్పడం విశేషం. దీంతో పలువురు ఈ దృశ్యాన్ని తమ సెల్‌ఫోన్లలో బంధించి సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం చేశారు.

చంద్రుని చుట్టూ...

సమిష్టి కృషి వల్లే సమర్థవంతంగా ఎన్నికలు

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల నిర్వహణలో ఉద్యోగులు సమర్థతవంతంగా పనిచేశారని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఎన్నికల నిర్వహణలో జిల్లా ప్రజల సహాయ, సహకారాలు, భాగస్వామ్యం మరువలేనిదన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతిఒక్కరినీ అభినందించారు. ముఖ్యంగా అధికారుల సమన్వయం.. సమిష్టి కృషితోనే అది సాధ్యమైందని కొనియాడారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో సమావేశమై ప్రతి ఒక్కరినీ అభినందించారు. జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం చాలా సంతోషకరమని, జీవితకాలం ఈ జ్ఞాపకాలు చెరిగిపోవన్నారు. కంప్లైంట్ మానిటరింగ్ సెల్ తెరిచామని, దానికి 1600 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఒక్కోసారి కుటుంబానికి దూరంగా 20 గంటలు కూడా నిరంతరాయంగా పనిచేయాల్సి వచ్చేదన్నారు. ఎన్నికలు విజయవంతం చేయడంలో జెసి నవీన్ కీలకపాత్ర పోషించారని కొనియాడారు. హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా అడ్డుకట్ట వేయడంలో ఎస్‌పి, రీ పోలింగ్ జరగకుండా చేయడంలో సబ్ కలెక్టర్, ఆర్‌ఒలు చేసిన కృషి అభినందనీయమన్నారు. నాలుగు నెలలుగా నోడల్ అధికారులు అంకితభావంతో చేపట్టిన విధులు ఎన్నికలు విజయవంతం చేయడానికి సహకరించాయని చెప్పారు. భోజనం, వసతి, రవాణా విషయంలో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు లేవనో, కరెంటు లేదనో, ఓట్ల గల్లంతనో, ఇంకా మరేదోననే ఫిర్యాదులు లేవని చెప్పారు. ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేశామని, ఇక మిగిలిన కౌంటింగ్ ప్రక్రియనూ ఇంతే నిబద్ధతతో పూర్తి చేద్దామన్నారు.

వికసించిన మే పుష్పం

ప్రజాశక్తి - నౌపడ

నౌపడలో అరుదైన మే పుష్పం వికసించింది. ఏడాదిలో ఒక్కసారి మాత్రమే ఈ పుష్పం వికసిస్తుంది. చూడ్డానికి ఆకర్షణగా ఉన్న ఈ పుష్పాన్ని చూసేందుకు గ్రామస్తులు వస్తున్నారు. ఇది ప్రతికూల వాతావరణంలో, ఇసుక నేలల్లో పెరిగి ఎండ వేడిమికి మేలో మాత్రమే కనిపిస్తుంది. దీంతో దీన్ని మే పుష్పంగా పిలుస్తుంటారు. అరుదైన ఈ పుష్పాన్ని నౌపడ సర్పంచ్ పిలక బృందాదేవి, రవికుమార్ రెడ్డి ఇంటి ఆవరణలో ఐదేళ్లుగా పెంచుకుంటున్నారు.

ఎన్నికలు ముగిశాయన్న నిర్లక్ష్యం వద్దు

విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని

ప్రజాశక్తి - విజయనగరం కోట

ఎన్నికల తర్వాత మన ప్రాంతం ప్రశాంతంగా ఉందన్న నిర్లక్ష్యం వద్దని, మరో 15 రోజులు ప్రతిఒక్కరూ ఇదే అప్రమత్తతతో పనిచేయాలని విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని పోలీసు అధికారులను ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత చోటుచేసుకున్న సంఘటనలు, తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై విశాఖపట్నం రేంజ్ పరిధిలోని విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్‌పిలు, ఇతర పోలీసు అధికారులతో డిఐజి స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా రేంజ్ పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది చాలా కష్టపడి, ప్రణాళికాబద్ధంగా క్షేత్రస్థాయిలో సమర్థవంగా పనిచేయడం వల్ల సార్వత్రిక ఎన్నికల్లో చిన్న చిన్న సంఘటనలు మినహా ప్రశాంతంగా నిర్వహించుకోగలిగామని చెప్పారు. అందుకు కృషి చేసిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులు ఉన్నాయని, మన ప్రాంతంలో ఎటువంటి శాంతిభద్రతల సమస్యలూ ఉత్పన్నం కాకుండా క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీలకతీతంగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆదేశించారు. సమావేశంలో విజయనగరం, మన్యం, శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి జిల్లా ఎస్‌పిలు ఎం.దీపిక, విక్రాంత్ పాటిల్, జి.ఆర్ రాధిక, కె.వి మురళీకృష్ణ, తుషీం సిన్హా తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని

సిపిఎస్ రద్దుకు నిరంతర పోరాటం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సిపిఎస్ విధానం రద్దు కోసం నిరంతర పోరాటం కొనసాగిస్తున్నట్లు ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు, ఐఫియా జాతీయ కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ తెలిపారు. సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఎపిటిఎఫ్ (1938) జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004 నుంచి సిపిఎస్‌ను రద్దు చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉద్యమిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఒపిఎస్‌ను పునరుద్ధరిస్తున్నా, బిజెపి పాలిత రాష్ట్రాల్లో సిపిఎస్ రద్దుపై సానుకూలత లేకపోవడం శోచనీయమన్నారు. సిపిఎస్‌ను రద్దు చేస్తామని గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాట ఇచ్చి తప్పారని విమర్శించారు. కొత్తగా వచ్చే ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేయాలని, లేకుంటే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక

ఎపిటిఎఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా టెంక చలపతిరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బల్లెడ రవి, బుక్కూరు వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. సహాధ్యక్షునిగా బలగ శ్రీనివాసరావు, అదనపు కార్యదర్శిగా పొన్నాడ బాలాజీరావు, ఉపాధ్యక్షులుగా ఎం.భుజంగరావు, ఆర్.వి అనంత ఆచార్యులు, వై.వి రమణ, బి.నవీన్, కార్యదర్శులుగా టి.శివరావు, టి.జోగారావు, ఎస్.రాజబాబు, బి.కృష్ణారావు, వి.శ్రీనివాసరావు, బి.చిన్నారావు, బి.వి జితేంద్రను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా డి.ఈశ్వరరావు వ్యవహరించారు.

మాట్లాడుతున్న సన్నశెట్టి రాజశేఖర్



రవి, వెంకటేశ్వర్లు

మహారాజశ్రీ శ్రీకాకుళం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.94/2024 in I.A. 235/2005 in O.S.125/1984

Between: సాదు చిన్నమ్మి(Dide) మరియు ఇతరులు ...పిటిషనర్/వాదులు
And: సాదు జంగాలు మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

To,
R-6: పొదిలేపు చిన్నమ్మి, భర్తలేటు గారయ్య @ గవరయ్య, వయస్సు: 65సం॥లు, గృహిణి, నివాసం. బలగ, శ్రీకాకుళం పట్టణం. శ్రీకాకుళం మున్సిపాలిటీ, శ్రీకాకుళం జిల్లా.

పై నెంబరు గల దావాలో మీరు 6వ ప్రతివాది, రెస్పాండెంట్ అయివున్నారు. పైకోర్టు వారు మీకు నోటీసులు నిమిత్తం **తేదీ 3-7-2024 న. మీ హాజరు నిమిత్తం వాయిదా వేసియున్నారు.** సదరు పైన తెలిపిన తేదీన 10-30 ని॥లకు సదరు కోర్టు వారి ముందు స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని హజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసు కోనవలెను, లేని యెడల ఈ కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించడం జరుగును.

// శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

పేరూరు నాగేశ్వర రావు
పిటిషనర్లు తరుపు న్యాయవాది,
శ్రీకాకుళం, సెల్:9848950706.

ఐటిఐలో ప్రవేశానికి నోటిఫికేషన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఐటిఐల్లో 2024-25 ఏడాదికి వివిధ కోర్సుల్లో చేరేందుకు నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఐటిఐల ప్రవేశానికి అడ్మిషన్ రిజిస్ట్రేషన్ (మొదటి దశ), వెరిఫికేషన్‌కు డిఎల్‌టిసి కేంద్రంలో ప్రత్యేక కౌంటర్ తెరిచినట్లు జిల్లా కన్వీనర్ ఒక ప్రకటన విడుదల చేశారు. 10వ తరగతి పాసైన అభ్యర్థులు, ఐటిఐలో ప్రవేశానికి అడ్మిషన్ పొందడానికి ఈఏడాది జూన్10లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నేరుగా దరఖాస్తుతో పాటు ఒరిజినల్ సర్టిఫికేట్‌లు 10 వ తరగతి, కులం, ఆధార్, కలర్ ఫోటో, ఇ-మెయిల్ ఐడి మనుగడలో ఉన్న శాశ్వత మొబైల్ నెంబర్‌తో దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఐటిఐలో మాత్రమే రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకోసం నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రి జంక్షన్‌లో ఉన్న డిఎల్‌టిసి/ఐటిఐలో ప్రత్యేక కౌంటర్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలలోపు సంప్రదించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జూన్ 18 నుంచి 26వరకు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటిఐలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అభ్యర్థుల మార్కుల ఆధారంగా కౌన్సిలింగ్‌కు హాజరు కావాల్సిన అభ్యర్థుల జాబితా విడుదల చేస్తామన్నారు. పభుత్వ డిఎల్‌టిసి/ఐటిఐ రెండేళ్లకుగాను ఎలక్ట్రిషియన్స్, ఫిట్టర్, ఇన్స్ట్రుమెంట్ మెకానిక్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, డ్రాఫ్ట్‌మాన్ సివిల్ కోర్సులు, ఏడాది కాలపరిమితి ఉన్న కోర్సులు కోపా (కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్), వెల్డర్, మహిళలకు కుట్టు శిక్షణ కోర్సులు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సకాలంలో సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వాణీకుమారికి డాక్టరేట్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వాణీకుమారి

నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో 'కంప్యూటర్ అప్లికేషన్స్' అధ్యాపకురాలు ఎస్.వాణీ కుమారికి డాక్టరేట్ లభించింది. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ ఆమెకు గురువారం డాక్టరేట్ ప్రధానం చేశారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. కె. సూర్య చంద్రరావు తెలిపారు. వాణికుమారి 'హైబ్రిడ్ సాఫ్ట్ కంప్యూటరింగ్ విత్ డీప్ ఫీచర్ ఎక్స్ట్రాక్షన్ టు ప్రెడిక్ట్ బ్రెస్ట్ క్యాన్సర్ యూజింగ్ మామోగ్రఫీ ఇమేజెస్' అనే అంశంపై ప్రొఫెసర్. కె. ఉషారాణి ఆధ్వర్యాన పరిశోధన చేశారు. ఈ పరిశోదనలకుగాను ఆమెకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సూర్య చంద్రరావు, కళాశాలలోని అధ్యాపకులు ఆమెను అభినందించారు.

డాక్టరేట్ అందుకుంటున్న వెంకటస్వామి

వెంకటస్వామికి డాక్టరేట్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త డాక్టర్ మంత్రి వెంకటస్వామికి డాక్టరేట్ లభించింది. ఢిల్లీలో బుధవారం సాయంత్రం డే స్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ, భారత్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సంయుక్తంగా ఈ డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్ హానరరీ డిగ్రీ పట్టాను ఆయనకు ప్రధానం చేశారు. తన సేవను గుర్తించి గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసిన సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎనర్జీఒకు 'ఐతమ్' విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎంబిఎ, బిటెక్, ఇఇఇ బ్రాంచ్‌లకు 2024 సంవత్సరానికి చెందిన విద్యార్థులు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఎనర్జీఒ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 16మంది ఉద్యోగాలను సాధించారని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. వార్షిక వేతనం రూ.2 లక్షల40 వేలతో పాటు అలివెన్స్ కలిపి మొత్తం రూ.5 లక్షల 40 వేల ప్యాకేజీ కంపెనీ చెల్లించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎఎస్ శ్రీనివాసరావు, ఇఇఇ హెచ్‌ఒడి కిరణ్ కుమార్, ఎంబిఎ హెచ్‌ఒడి డాక్టర్ కిరణ్ కుమార్, ప్లేస్మెంట్ డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాలను అందజేస్తున్న శంకర్

క్రీడాకారులకు అండగా ఉంటా...

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్రీడల వలన యువతకు అనేక అవకాశాలు వస్తాయని, శారీరక శ్రమతో ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమవుతుందని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో గురువారం రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన అథ్లెటిక్స్ క్రీడాకారులకు స్పోర్ట్స్ ఉష్ , హర్డిల్స్ క్రీడాసామాగ్రిని ఆయన అందజేశారు. జిల్లా ఎన్‌టిఆర్, మోక్షజ్ఞ ఫ్యాన్స్ ఆధ్వర్యాన ఈసామాగ్రిని కొనుగోలు చేశారు. వీటిని అందజేసిన ఆయన నందమూరి అభిమానులను అభినందించారు. ఎన్నికల్లో తనకు అండగా నిలిచిన యువత, మహిళలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపడానికి తనవంతు పూర్తి సహకారాన్ని అందిస్తానని తెలిపారు. కూటమి అధికారంలోకి రాగానే క్రీడాకారుల కోసం కోడి రామ్మూర్తి స్టేడియంను వీలైనంత తొందరలో పూర్తిచేసి క్రీడాకారులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, టిడిపి నాయకులు చల్లా వాసు, జగన్, పేట పద్మ, కోచ్‌లు శ్రీనివాస్, తేజ, సురేంద్ర, సురేష్, భాస్కర్, మోహన్, రాజు, మహేష్ క్రీడాకారులు పాల్గొన్నారు.

నరసయ్యను పరామర్శిస్తున్న రామ్మోహన్ నాయుడు, శంకర్

క్షతగాత్రులకు పరామర్శ

శ్రీకాకుళం అర్బన్: ఎన్నికల పోలింగ్ సమయంలో చోటుచేసుకున్న విభేదాలతో కొట్లాట జరిగి గాయపడ్డ క్షతగాత్రులను ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు గురువారం పరామర్శించారు. మండలం చాపురం గ్రామాన్ని ఆయన టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్‌తో కలిసి సందర్శించారు. గాయపడ్డ అల్లు నర్సయ్య ఇంటికి వెళ్లి వారి క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల రోజున జరిగిన ఘటనపై బాధితులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఓటమి భయంతోనే వైసిపి కవ్వింపు చర్యలకు పాల్పడిందని, రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల తర్వాత జరుగుతున్న పరిణామాలను సైతం ప్రజలు గమనించాలన్నారు. పోలింగ్ పూర్తవడంతో ఇక ఓడిపోతామన్న భయంతో అల్లర్లు సృష్టించడానికి ప్రత్నిస్తున్నారని ఆరోపించారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు పంచిరెడ్డి అప్పలనాయుడు, చాపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

మట్టి రోడ్లకు మోక్షమెప్పుడో..?

- పట్టించుకోని యంత్రాంగం
- గిరిజనులకు శాపం

ప్రజాశక్తి- బూర్జ

మారుమూల ప్రాంతాలు సైతం పక్కా రహదారులు ఏర్పాటు చేస్తాం. గిరిజన గ్రామాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఆర్భాటంగా ప్రకటన గుప్పిస్తున్న ప్రభుత్వాలు, మరోవైపు కనీసం గిరిజన గ్రామాల వైపు కన్నెత్తయిన చూడని అధికార యంత్రాంగం. దీంతో అనునిత్యం గిరిజనులకు నడక కష్టాలు తప్పడం లేదు. అభివృద్ధికి ఆమడ దూరంలో గిరిజన గ్రామాలు కనిపిస్తున్నాయి. దరిచేరని పథకాలు, పట్టించుకోని ప్రభుత్వాలతో దిక్కుతోచని స్థితిలో కొట్టు మిట్టాడు తున్నాయి.దశాబ్దాలు మారిన వారి తలరాతలు మాత్రం మారడం లేదు. గ్రామాల్లో కనీస సదుపాయాలు లేక పట్టించుకునే నాధుడు కరవవ్వడంతో వారి అవస్థలు వర్ణతీతంగా మారాయి.

మండలంలోని పాలవలస పంచాయతీ పరిధిలో ఉన్న కొత్తవలస గిరిజన గ్రామంతో పాటు బూర్జమాను గూడ, సోమిదాలవలస గ్రామాలకు సరైన రహదారి ఈనాటికి కూడా లేకపోవడం శోచనీయం. ఎన్నికల వేళ ప్రజా ప్రతినిధులు గ్రామాలకు వచ్చి మీ గ్రామాలకు అది చేస్తాం,

అధ్వానంగా ఉన్న కొత్తవలస గిరిజన గ్రామ ప్రధాన రహదారి

ఇది చేస్తామని హామీలు గుప్పిస్తున్నారే తప్ప ఇంతవరకు పట్టించుకున్న నాధుడే కరువయ్యారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే కనీసం సరైన రహదారి సౌకర్యం లేదని తెలిపారు. ముఖ్యంగా చిన్నపాటి చినుకులకు చెరువులను తడిపించే మాదిరిగా మట్టిరోడ్లు తలపిస్తున్నాయన్నారు.

అత్యవసర సమయంలో 104, 108 వంటి వాహనాలు వచ్చేందుకు కూడా అవకాశం లేదని తెలిపారు. దీంతో అనునిత్యం అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు. రహదారి ఏర్పాటు కోసం పలుమార్లు అధికారుల చుట్టూ పాలకవర్గం చుట్టూ తిరిగి ఫిర్యాదులు చేసినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవ హరిస్తున్నారన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు తమకు అవకాశం లేదన్నారు. చిన్నపాటి వర్షం పడితే ఇతర ప్రాంతాలకు తమకు రాకపోకలు స్తంభిస్తాయని వా పోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమ గ్రామాలకు అవసరమైన రహదారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

మురుగుతో అవస్థలు

గ్రామాల్లో సరైన ముగురుకాలువలు లేకపోవడంతో మురుగునీరు వీధి మధ్యలో నిల్వ ఉండిపోవడంతో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నామన్నారు. దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని, దీంతో రోగాల బారిన పడుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

సోమిదాలవలస గిరిజన గ్రామ రహదారి దుస్థితి

రహదారి లేక అవస్థలు

మా గ్రామాలకు రహదారి ఏర్పాటు ఎప్పుడు చేస్తారో తెలియడం లేదు. సరైన రహదారి సదుపాయం లేకపోవడం వలన అనునిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నాం. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమ గ్రామానికి పక్కా రహదారి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

- నిమ్మక ప్రవీణ్‌కుమార్, కొత్తవలస

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

పాందూరు : లోలుగులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పోలాకి: జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా పోలాకి పిహెచ్‌సి పరిధిలో వైద్యాధికారి సుమప్రియ ఆధ్వర్యంలో గురువారం డెంగీ వ్యాధి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశ కార్యకర్తలకు డెంగీ వ్యాధి లక్షణాలు, వ్యాధి నిర్ధారణ, చికిత్స, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సుమప్రియ వివరించారు. ఎడిస్ అనే పగటిపూట కరిచే దోమ వలన డెంగీ వస్తుందని, వీటినే టైగర్ దోమలు అని కూడా పిలుస్తారని, రెండు కనుబొమ్మల మధ్య ప్రాంతంలో నొప్పి రావడం, కనుగుడ్లు నొప్పి, కీళ్ళ నొప్పులు, కండరాల నొప్పులు కనిపిస్తాయని, ప్లేట్‌లెట్లు అకస్మాత్తుగా తగ్గడం జరుగుతుందన్నారు. సకాలంలో చికిత్స అందకపోతే ప్రాణాపాయం సంభవిస్తుందని తెలిపారు. దోమలు పెరగకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురికి నీటి కుంటలపై వేస్ట్ ఇంజన్ ఆయిల్ జల్లి దోమల లార్వాలకు శ్వాస ఆడకుండా చేయవచ్చని, బావుల్లో గంబుషియా గప్పి వంటి చేపలను పెంచడం ద్వారా దోమ లార్వాలను సంహరించగలమని, పొడుగు చేతుల చొక్కాలు, ఫాంట్స్ ధరించాలని, దోమతెరలు వాడాలని, తలుపులు, కిటికీలు స్క్రీనింగ్ చేయించుకోవాలని, శుక్రవారం ఫ్రైడే సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా దోమలు పెరిగే ఆవాసాలను గుర్తించి సమూలంగా నాశనం చేయడం ద్వారా ఈ వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ ఈశ్వరమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు శేఖర్‌బాబు, లక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలాకి : ర్యాలీ నిర్వహిస్తున్న పిహెచ్‌సి సిబ్బంది

పొందూరు: డెంగీ బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాడివలస పిహెచ్‌సి వైద్యాధికారులు డా.రమేష్ నాయుడు, డా.నవీన్ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పిహెచ్‌సి పరిధిలో పొందూరు, లోలుగు గ్రామాల్లో వైద్య సిబ్బంది డెంగ్యూ పట్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

బూర్జ: మండలంలోని తుడ్డలిలో గురువారం బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని పావణి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ప్రస్తుతం ఎండలతో పాటు అడపాదడపా కురుస్తున్న వర్షాలు కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాల చుట్టూ మురుగునీరు లేకుండా చూసు కోవాలన్నారు. ఆమెతో పాటు ఎంఎల్‌హెచ్‌పి రాధ, ఎఎన్ఎం లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ మొఖలింగం, డిఇఒ వెంకటరమణ, పైలట్ అసిరి నాయుడు, ఆశావర్కర్లు రూపవతి, రాణి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వం రాబోతుంది'

కోటబొమ్మాళి: మండలం హరిశ్చంద్రపురంలో టెక్కలి నియోజకవర్గ టిడిపి తెలుగుయువత అధ్యక్షురాలు పూజారి శైలజ గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి ఉమ్మడి ప్రభుత్వం రాబోతుందన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు పడిందని, మహిళలు, యువత పెద్దఎత్తున ఓటు వేశారని, ఇది ఉమ్మడి కూటమికి గెలుపు అని అమె ధీమా వ్యక్తం చేశారు. టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎంపీగా కింజరాపు రామ్మోహన్ నాయుడు అత్యధిక మెజార్టీతో విజయాన్ని సాధించబోతు న్నారన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: కవిటిలో కొత్తగా ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్ కోసం రాజపురం నుంచి వేస్తున్న 33 కెవి లైన్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కెవి కవిటి టౌన్ లైన్ మైంటినెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో కవిటి, కవిటి కొత్తూరు, గొండ్యాల పుట్టుగ, ప్రగడపుట్టుగ, రామయ్యపుట్టుగ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొత్తూరు: మండలంలోని నివగాం సబ్ స్టేషన్ 33/11 కె.వి నిర్వహణ పనులు శుక్రవారం జరగనున్నందున 8 గంటలు నుంచి మద్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, ఆ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండని, ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఎఇ జి.శంకరరావు ప్రకటనలో కోరారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

నందిగాం: పారిశుధ్యంపై కార్యదర్శులంతా ప్రత్యేక దృష్టి సారించాలని ఇఒపిఆర్‌డి టి.రాజారావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని కూడళ్ల వద్ద తాగునీరు ఏర్పాటు చేయాలని, ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు గ్రామాల్లో మురికి కాలువలు శుభ్రపరిచేందుకు వీలుగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు సంతోష్ కుమార్, చంద్రశేఖరరావు, పద్మలోచన తదితరులున్నారు.

అత్యవసరంగా రక్తదానం

శ్రీకాకుళం అర్బన్: స్థానిక జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డి.సుశీలకు ప్లేటిలెట్స్ కౌంట్ పదివేలకు పడిపోవటంతో ప్రాణాపాయ స్థితికి చేరారు. కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో రక్తం కోసం పరుగులు తీసి చివరకు రెడ్‌క్రాస్ సిబ్బందిని సంప్రదించారు. ఎ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో అర్ధరాత్రి సమయంలో జిల్లాలోని కవిటి మండలం, దూగానిపుట్టుకకు చెందిన బి.హరిప్రసాద్ రక్తదానం చేసేందుకు ముందుకొచ్చారు. వేకువజామున ఆయన శ్రీకాకుళం చేరుకుని ఎస్‌డిపి అందించడంతో ఆమెకు ప్రాణాపాయం తప్పింది.

రక్తదానం చేస్తున్న హరిప్రసాద్

మధ్యవర్తిత్వంపై అవగాహన అవసరం

పలాస : మాట్లాడుతున్న జడ్జి మాధురి

పలాస: మధ్యవర్తిత్వంపై న్యాయవాదులు అవగాహన కలిగి ఉండాలని పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి అన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు మేరకు గురువారం పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాదులతో జడ్జి యు.మాధురి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్బంగా జడ్జి మాట్లాడుతూ మధ్యవర్తి పాత్ర, మధ్యవర్తిత్వం వలన కలిగే ప్రయోజనాలు, మధ్యవర్తిత్వం ఆవశ్యకత, మధ్యవర్తిత్వం చేయుటకు కావాల్సిన అంశాలపై న్యాయవాదులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్.విశ్వేశ్వరరావు, కార్యదర్శి వెంకటరావు, జాయింట్ సెక్రటరీ అనిల్ రాజు, వైస్ ప్రెసిడెంట్ ఫయాద్ అహ్మద్, రాజారత్నం నాయుడు, పి ఎల్ నారాయణ, ఎల్ చంద్రశేఖర్, కోత రజని కుమార్, బికెఆర్ పట్నాయక్, శ్యామ్, చిట్టిబాబు, జి ప్రభాకర్, రవి పట్నాయక్, సుధారాణి, దివ్య, పాణిగ్రహీ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మధ్యవర్తిత్వంపై న్యాయవాదులు అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి పి.పరేష్ కుమార్ అన్నారు. స్థానిక కోర్టులో న్యాయవాదులతో సదస్సు నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణయ్య, ప్రహ్లాద్ రెడ్డి, మనోజ్ కుమార్ సామంతు, వినయ్ చంద్ర పట్నాయక్, భగవాన్ దాస్, బైరాగి రెడ్డి, నాగరాజు పాత్రో, సీతయ్యతో పాటు విశ్రాంత ప్రిన్సిపాల్ నిత్యానంద పట్నాయక్, ఎం.రాంబాబు, డి.కృష్ణమూర్తి రెడ్డి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న జడ్జి పరేష్ కుమార్

ఘనంగా శిరీష జన్మదిన వేడుకలు

పలాస : కేకు కట్ చేస్తున్న శిరీష

ప్రజాశక్తి- పలాస

పలాస టిడిపి కార్యాలయంలో గురువారం టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పలాస టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి గౌతు శివాజీ దంపతులు, భర్త వెంకన్న చౌదరి, టిడిపి నాయకులు, కార్యకర్తలు నడుమ పుట్టినరోజు కేక్ కట్ చేశారు. పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కాశీబుగ్గ సాయిరాం మందిరంలో శివాజీ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, టంకాల రవి శంకర్ గుప్తా, బి.నాగరాజు, ఎం. నాని, కె.కన్నారావు, దువ్వాడ హేంబాబు చౌదరి, దువ్వాడ శ్రీకాంత్, మాజీ టిడిపి జిల్లా అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, జోగ మల్లి, డొక్కరి శంకర్, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: పలాస టిడిపి ఎమ్మెల్యే గౌతు శిరీష జన్మదిన వేడుకలు నగరంలోని విశాఖ ఎ కాలనీ టిడిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. శ్రీశయన సంక్షేమ సంఘం ఆద్వర్యాన గురువారం నిర్వహించిన ఈవేడుకల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ హాజరై కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో శ్రీశయన సంఘం నాయకులు మండల మన్మథరావు, బుర్రి మధు పాల్గొన్నారు.

అకాల వర్షం... అపరాలకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి- బూర్జ

అకార వర్షం మండలంలోని అపరాల పంట రైతుల నడ్డి విడిచింది. ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులకు నిరాశే ఎదురైంది. చేతికి వచ్చే సమయంలో అకాల వర్షం రైతులను నిండా ముంచింది. మరికొద్ది రోజుల్లో పంట చేతికి వస్తుందన్న ఆశతో ఉన్న రైతులకు తీవ్రమైన నష్టం చూపించింది. మండలంలో కిలాంతరి, వైకుంఠపురం, మదనాపురం, పెద్దపేట, కొల్లివలస తదితర గ్రామాల్లో సుమారు 150 ఎకరాల్లో నువ్వులు, పెసర పంటలను పండిస్తున్నారు. ఇప్పటికే కోతలు కోసి నూర్పుకు సిద్ధమయ్యారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట మొత్తం తడిసి ముద్దయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అపరాల పంట కోసం పెట్టిన పెట్టుబడి కూడా నష్టపోయిన పరిస్థితి దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను కాపాడుకునేందుకు టార్పాలిన్లు కప్పి ఉంచామని రైతులకు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి తమకు న్యాయం చేయాలని మండలంలోని రైతుల కోరుతున్నారు.

వై.పర్తలో తీసిన పెసర పంటకు టార్పాలిన్ కప్పుతున్న రైతు

కిష్టప్పపేటలో నీలమ్మ సంబరాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మండలం కిష్టప్పపేటలో నీలమ్మ తల్లి అమ్మవారి పండుగలు గురువారం ఘనంగా జరిగాయి. మాజీ ఎంపిపి గొండు జగన్నాధరావు, అయన తనయులు, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్, డాక్టర్ గొండు గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాలు అంబరాన్ని తాకాయి. మేళతాళాలు, భాజా భజంత్రీల నడుమ చిన్నారుల కోలాటం, కాళికాదేవి నృత్య రూపాకాల సందడితో గ్రామం పండుగ శోభను సంతరించుకుంది. చిన్నారుల మొదలు వృద్దులు సైతం అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్నారు. పెద్దఎత్తున సందర్శకులు తరలివచ్చారు. సాంస్కృతిక వేడుకలు ఆకట్టుకున్నాయి.

ఎపిఆర్‌డిసిలో ప్రథమ ర్యాంకు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

లక్కివలసకు చెందిన బుడ్డెపు ఢిల్లేశ్వరరావు, అమరావతి దంపతుల కుమారుడు సాయి కృపారెడ్డి ఎపి అర్‌డిసి పరీక్షల్లో ప్రథమ ర్యాంకు సాధించాడు. విశాఖపట్నంలో ఒక ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదివాడు. ఎపి రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ నిర్వహించిన డిగ్రీ ప్రవేశ పరీక్షల్లో ఎంపిసి విభాగంలో 118 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం పొందాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సివిల్స్ సాధించి తీరుతానన్నాడు. ర్యాంకు సాధించడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పలాస: మండలం పెదంచలకు చెందిన వరిశ జానారావు (36) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కుటుంబ సభ్యులు, స్థానికులు కథనం మేరకు జానారావు విశాఖపట్నం వెళ్లేందుకు మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి కాశీబుగ్గ బయలుదేరారు. గ్రామానికి సమీపంలో రోడ్డు ప్రమాదం జరగ్గా క్షతగాత్రుడుకు మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరిగి ఇంటికి తీసుకు వచ్చారు. గురువారం రాత్రి మృతి చెందారు. మృతుడుకు భార్య భారతి, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. జానారావు చనిపోవడంతో భార్య, కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

నేత్రదానం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని చిన్న మండల వీధిలో నివాసముంటున్న టి.శ్రీనివాసరావు (46) రోడ్డు ప్రమాదానికి గురై జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులు శ్రీనివాసరావు కళ్లను దానం చేశారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన ఆయన నేత్రాలను సేకరించిన టెక్నీషియన్లు వాటిని మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ద్వారా విశాఖలోని ఎల్.వి.ప్రసాద్ నేత్రాలయానికి పంపించారు.

దాడుల్లో పట్టుకున్న మద్యం సీసాలతో ఇన్‌స్పెక్టర్, సిబ్బంది

అక్రమ మద్యంపై దాడులు

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని కేసరిపడ గ్రామ సమీపంలో గురువారం జరిపిన దాడుల్లో ఒడిశాకు చెందిన 60 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సోంపేట స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఆర్ జైభీమ్ తెలిపారు. ఒడాశా మద్యం తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో ఈ దాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. గంగాధరపురంకు చెందిన ఎం.లక్ష్మణరావు తన ద్విచక్ర వాహనంపై 60 బడిశా మద్యం సీసాలను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అక్రమ మద్యం రవాణాపై సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. ఈ దాడుల్లో పలాస టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేటలో నాటుసారా, మద్యాన్ని ధ్వంసం చేస్తున్న అధికారులు

నాటుసారా, మద్యం సీసాలు ధ్వంసం

ప్రజాశక్తి- సోంపేట

పట్టణంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయం వద్ద పోలీసుల దాడుల్లో సీజ్ చేసిన అక్రమ మద్యం, నాటు సారా ప్యాకెట్లను అధికారులు గురువారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ జై.భీమ్ మాట్లాడుతూ గత ఆరు నెలల కాలంలో సీజ్ చేసిన 4877 లీటర్ల నాటుసారాతో పాటు 43 లీటర్ల మద్యం సీసాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తెలిపారు. కార్యక్రమంలో పలాస ఇన్‌స్పెక్టర్ రామచంద్రారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రవి ఎన్నికపై హర్షం

ప్రజాశక్తి- కవిటి


రవి

గురువారం జరిగిన ఎపి టిఎఫ్ 1938 నూతన జనరల్ కౌన్సిల్ సమావేశంలో బొరివంక గ్రామానికి చెందిన బల్లెడ రవి జిల్లా అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రవి ఎన్నికపై కవిటి మండల శాఖ నాయకులు బల్లెడ లక్ష్మణమూర్తి, కొత్తపల్లి రంగారావు, మొర్రిగోపి, శమళ్ల రాజబాబు, ధర్మారావు, త్రిలోచన బిసాయి, శ్రీరామ్ మూర్తి, హిమ కుమార్, గార రాంబాబు, శ్రీమణి, విజయ హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే అశోక్‌తో యువత

బిజీబిజీగా ఎమ్మెల్యే అశోక్

కవిటి: ఇచ్చాపురం ఎమ్మెల్యే బెందాలం అశోక్ గత మూడు రోజులుగా తీరికలేకుండా గడుపుతున్నారు. ఎన్నికలు ముగిసిన తెల్లవారి నుంచే రామయ్య పుట్టుగలోని ఆయన క్యాంపు కార్యాలయానికి నియోజక వర్గ టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పోటెత్తుతున్నారు. తమతమ పరిధిలో జరిగిన పోలింగ్ శాతం, తమకు వచ్చే మెజారిటీపై అంచనాలు వేస్తూ ఎమ్మెల్యే అశోక్‌కు ముందస్తు శుభాకాంక్షలు చెబుతున్నారు. ముఖ్యంగా ఈసారి మహిళలు, యువత ఎక్కువగా వస్తుండడం విశేషం. గత మూడు రోజులుగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే టిడిపిలో ఫుల్ జోష్ కనిపిస్తోంది.

సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి- లావేరు

చిన్నతనం నుంచే చిన్నారులు సెల్‌ఫోన్లుకు దూరంగా ఉండాలని రిసోర్స్‌పర్సన్ ఎం. రఘుబాబు అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా రెండవరోజు లావేరు శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు సెల్‌ఫోన్ వాటిపై చెడు ప్రభావం విద్యార్థులకు తెలియజేశారు. అలాగే చిన్నప్పటినుంచి రామాయణం, మహాభారతాన్ని పూర్తిస్థాయిలో నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లపై విద్యార్థులకు వివరిస్తున్న రఘుబాబు